నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY

సంపుటి : 13 సంచిక : 122 రంగారెడ్డి | ఆదివారం 30 ఆగష్టు 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 30-08-2026 | Sunday | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To:Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada




## బురదమట్టిలో మృతదేహాలు..
# హిమనదం మిగిల్చిన అతిపెద్ద విషాదం
## కొనసాగుతున్న సహాయక చర్యలు

నిర్భయవార్త ప్రతినిధి :

నేపాల్‌చైనా సరిహద్దు ప్రాంతంలో హిమాలయాల్లోని భారీ హిమనదం (గ్లేసియర్) కుప్పకూలడంతో సంభవించిన భయంకర ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) దేశ చరిత్రలోనే అత్యంత విషాదకర ప్రకృతి విపత్తుల్లో ఒకటిగా నిలిచాయి. తాజా అధికారిక సమాచారం ప్రకారం ఈ విపత్తులో 626 మంది ప్రాణాలు కోల్పోగా, 2,400 మందికిపైగా గల్లంతయ్యారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. నాలుగో రోజుకు చేరిన సహాయక చర్యలకు నిరంతర వర్షాలు, కొండచరియలు, దెబ్బతిన్న రహదారులు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయి. నేపాల్‌లోని రసువా జిల్లాకు సమీపంలో, చైనా (టిబెట్) సరిహద్దు వద్ద ఉన్న హిమనదంలోని దిగువ భాగం ఒక్కసారిగా విరిగి లోయలో పడిపోయింది. దీనివల్ల మంచు, రాళ్లు, మట్టి భారీ వేగంతో కిందకు దూసుకెళ్లి నదీ ప్రవాహాన్ని ఒక్కసారిగా ఉధృతం చేశాయి. క్షణాల్లోనే భోటెకోషి, త్రిశూలీ నదులు ఉప్పొంగి భారీ వరదలుగా మారి మార్గమధ్యంలోని గ్రామాలు, వంతెనలు, రహదారులు, జలవిద్యుత్ ప్రాజెక్టులను ముంచెత్తాయి. ఉపగ్రహ చిత్రాల విశ్లేషణ కూడా ఈ విపత్తుకు హిమనదం కూలిపోవడమే ప్రధాన కారణమని సూచిస్తోంది.



**గ్రామాలు నేలమట్టం.. భారీ ఆస్తి నష్టం**

వరదల ధాటికి అనేక గ్రామాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వందలాది ఇళ్లు కొట్టుకుపోగా, వంతెనలు, రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నేపాల్‌ను చైనాతో అనుసంధానించే కీలక సరిహద్దు మార్గాలు తెగిపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. అనేక ప్రాంతాలు దేశంలోని మిగతా ప్రాంతాలతో సంబంధాలు కోల్పోయాయి.

**వేలాది మంది కోసం గాలింపు**

నేపాల్ సైన్యం, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. అయితే ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ల వినియోగం పలుమార్లు నిలిపివేయాల్సి వచ్చింది. మట్టితో నిండిపోయిన సొరంగాల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు ప్రత్యేక బృందాలు ప్రయత్నిస్తున్నాయి. గల్లంతైన వారిలో జలవిద్యుత్ ప్రాజెక్టుల కార్మికులు, విదేశీయులు, యాత్రికులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**మరోసారి వరదల ముప్పు**

హిమనదం కూలిన ప్రాంతంలో కొత్తగా ఏర్పడిన సరస్సులు నిండిపోతుండటంతో మరోసారి వరదలు సంభవించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. భోటెకోషి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు.

**సాంకేతిక సహాయంపై నేపాల్ విజ్ఞప్తి**

భారత్, చైనా, అమెరికా సహా పలు దేశాలు సహాయాన్ని ప్రకటించాయి. అయితే సాధారణ శోధన రక్షణ బృందాల కంటే డీఎన్‌ఏ గుర్తింపు, మృతదేహాల సంరక్షణ, సొరంగాల్లో రక్షణ చర్యలు, తాత్కాలిక వంతెనల ఏర్పాటు వంటి ప్రత్యేక సాంకేతిక సహాయం అవసరమని నేపాల్ ప్రభుత్వం వెల్లడించింది. దీర్ఘకాల పునరావాసం, పునర్నిర్మాణానికి కూడా అంతర్జాతీయ సహకారం కోరుతోంది.

**వాతావరణ మార్పులపై ఆందోళన**

హిమాలయ ప్రాంతంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా హిమనదాలు అస్థిరంగా మారుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో హిమనదాల కరుగుదల వేగవంతమవడం, కొత్త హిమసరస్సులు ఏర్పడడం వల్ల ఇలాంటి ఆకస్మిక వరదల ప్రమాదం పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ విపత్తు హిమాలయ ప్రాంతంలో వాతావరణ మార్పుల ప్రభావంపై మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

# రైతుల కోసం గోదాములు ఏర్పాటు చేయాలి

- 15 రోజుల్లో భూ సర్వే పూర్తి చేయాలి: కడియం శ్రీహరి



నిర్భయవార్త ప్రతినిధి : రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు గోదాములు ఏర్పాటు చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. 15 రోజుల్లో భూ సర్వే పూర్తి చేసి లేఅవుట్ మ్యాప్ సిద్ధం చేయాలని, 5 వేల నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. శనివారం ధర్మసాగర్ మండలం ముప్పారం, వేలేరు మండలం సోడాషపల్లి గ్రామాల్లో ఏనుమాముల మార్కెట్‌కు చెందిన స్థలాలను మార్కెట్ చైర్మన్ ఎర్ర ప్రియాంక అనిల్‌తో కలిసి కడియం శ్రీహరి పరిశీలించారు. ముప్పారంలో అందుబాటులో ఉన్న భూమి వివరాలను సర్వే చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సోడాషపల్లి సబ్‌యార్డులో వాచ్‌మన్, విద్యుత్, తాగునీరు, జంగిల్ క్లియరెన్స్ పనులను వెంటనే చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా గోదాం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సర్‌పై అభ్యంతరాలు.. గడువు పొడిగించాలని సీఈసీకి సీఎం లేఖ



హైదరాబాద్:నిర్భయవార్త ప్రతినిధి : ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలని కోరుతూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. అక్టోబర్ 19తో గడువు ముగుస్తున్న నేపథ్యంలో, సమీప భవిష్యత్తులో ఎన్నికలు లేనందున గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల పరిశీలనలో లోపాలు ఉన్నాయని, ఇళ్లు మారిన వారి ఓట్లను నోటీసు లేకుండా తొలగించవద్దని కోరారు. గ్రామ, వార్డు సభల్లో ముసాయిదా ఓటర్ జాబితాను రెండుసార్లు చదివి వినిపించాలని, నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు నాలుగు వారాల గడువు ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో అదనపు ఈఆర్‌వోలను నియమించాలని సీఎం కోరారు.

# ప్రతిపక్షాలవి అబద్ధపు మాటలు

- పేదలే లక్ష్యంగా కాంగ్రెస్ సంక్షేమ పాలన
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణలో ప్రతిపక్షాలు నోరు తెరిస్తే అబద్ధాలే మాట్లాడుతున్నాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. శనివారం నిర్వహించిన సీలింగ్ భూముల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

**భూభారతితో భూ సమస్యలకు పరిష్కారం**

భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు 'భూభారతి' చట్టాన్ని తీసుకొచ్చామని పొంగులేటి తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పారదర్శకంగా చర్యలు చేపడుతోందన్నారు. భూమి హక్కులు, పట్టాలకు సంబంధించి పేదలకు ఇబ్బందులు లేకుండా వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని చెప్పారు.

**పేదలకు ఇళ్లు ఇస్తుంటే విషప్రచారం**

పేదలకు ఇళ్లు, భూమి పట్టాలు అందిస్తూ వారి సొంతింటి కలను నెరవేరుస్తుంటే ప్రతిపక్షాలు తట్టుకోలేక విషప్రచారం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సీలింగ్ భూముల పట్టాల పంపిణీ ద్వారా అర్హులైన పేదలకు భూమిపై హక్కు కల్పిస్తున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

# కేంద్ర ప్రభుత్వ ఫెర్టిలైజర్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలి



హైదరాబాద్ :నిర్భయవార్త ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫెర్టిలైజర్ యాప్‌పై రైతులకు మరింత అవగాహన కల్పించాలనీ, ఆ యాప్‌లో వచ్చే సమస్యలపై కేంద్ర అధికారులతో మాట్లాడి ఏరోజుకారోజు పరిష్కరించాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. యాంత్రీకరణ పథకంలో ఇచ్చే పనిముట్లను ఖరారు చేశామనీ, ఈసారి సబ్సిడీ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేస్తామని ప్రకటించారు. కాంప్లెక్స్ ఎరువులకు కూడా సబ్సిడీ ఇవ్వాలని కేంద్రాన్ని కోరామన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో వేగం పెంచాలనీ, రైతులకు రెండు మూడు రోజుల్లోనే ఆయిల్‌పామ్ మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, సహకార శాఖల పరిధిలోని పలు అంశాలపై ఉన్నతాధికారులతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాంత్రీకరణ పథకంలో పనిముట్లు సరఫరా చేసే సంస్థల ఎంప్యానెల్‌మెంట్ ప్రక్రియను హాకా అధికారులు పరిశీలిస్తున్నార తెలిపారు. నాణ్యత, ధర, రైతులకు అందుబాటు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంప్యానెల్ లిస్టును త్వరగా ఖరారు చేయాలని సూచించారు. రాష్ట్రంలో యూరియా సరఫరాలో ఇబ్బందుల్లేవని స్పష్టం చేశారు.

## పల్లె అభివృద్ధికి భరోసా



నిర్భయవార్త ప్రతినిధి : ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం దండేపల్లిలో నిర్వహించిన 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో కొత్త పంచాయతీ భవనం, వీవో భవనం, అంతర్గత సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులకు హామీ ఇచ్చారు. దండేపల్లి–దేశాయిపల్లి–కమలాపూర్ రహదారికి రూ.1.20 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. పంచాయతీ భవనాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ రోడ్లు, కాలువలు, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. దశాబ్దాల తర్వాత గ్రామానికి బస్సు సౌకర్యం వచ్చిందని, ఆదివారం కూడా బస్సు నడిచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. అర్హులైన వారు ఈ నెల 31లోగా పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మహిళలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా విని, అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా పాలన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


నిర్భయవార్త
సంపాదకీయం
ఆదివారం 30 ఆగష్టు 2026

# రక్తమోడుతున్న రోడ్లు

తెలుగు రాష్ట్రాల రహదారులు రక్తసిక్తంగా మారుతున్నాయి. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో కోదాడ, చిలకలూరిపేట, అనంతపురం రోడ్డు ప్రమాదంలో పదిహేను మంది మృతి చెందటం కలవరపరుస్తోంది. మన రహదారి వ్యవస్థ భద్రతా, బాధ్యత ఎంతగా కొరవడుతోందో ఈ ప్రమాదాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి ప్రమాదం తర్వాత కొద్దిసేపు కలకలం, కొన్ని పరామర్శలు, పరిహారం ప్రకటనలు. ఆ తర్వాత మళ్లీ యథాతథం. ప్రమాదం అనుకోని ఘటనే కావచ్చు. కానీ ఒకే తరహా ప్రమాదాలు మళ్లీ మళ్లీ జరుగుతుంటే అది వ్యవస్థ వైఫల్యమే. తెల్లవారుజామున ప్రయాణాలు, డ్రైవర్ల నిరంతర డ్యూటీలు, నిద్రలేమి ఇవన్నీ ప్రైవేటు బస్సు ప్రమాదాల వెనుక పదేపదే కనిపిస్తున్న కారణాలే. రాత్రివేళల్లో దూర ప్రయాణాలు చేసే ప్రైవేటు ట్రావెల్స్ డ్రైవర్లపై కనీస నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడం ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తోంది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవర్ల విశ్రాంతి నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఆగి ఉన్న వాహనాలకు రిఫ్లెక్టర్లు, హెచ్చరిక సంకేతాలు లేకపోవడం వంటి చిన్న నిర్లక్ష్యాలు కూడా భారీ ప్రాణ నష్టానికి కారణమవుతున్నాయి. జాతీయ రహదారులపై టోల్ రుసుము వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధలో పదో వంతైనా రహదారుల నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై చూపడం లేదన్న విమర్శలు బలంగా ఉన్నాయి. జాతీయ రహదారిపై ఏకారణంచేతనైనా వాహనం నిలిచిపోతే దానిని వెంటనే తరలించే విధానం సరిగా అమలుకావడం లేదు. గతంలో కర్నూలు, ప్రస్తుతం కోదాడ వద్ద జరిగిన ప్రమాదాలకు ఇదే ప్రధాన కారణం. టోల్ వసూళ్లలో చూపుతున్న శ్రద్ధను రహదారి నిర్వహణ, డ్రైనేజీ నిర్మాణం, భద్రత విషయంలో చూపడం లేదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఫాస్టాగ్ స్కానింగ్ సమస్యలు, లేన్ మార్పులో ఇబ్బందులు, ఆక్రమణలు, సరైన పర్యవేక్షణ లేమి వంటివి టోల్ ప్లాజాల వద్ద నిత్యకృత్యంగా మారాయి. ప్రజల నుంచి రుసుము వసూలు చేసే సంస్థలు, ఆ మేరకు రహదారుల నాణ్యత, ప్రమాద నివారణ చర్యలు, అత్యవసర సహాయక వ్యవస్థలు కల్పించాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోకూడదు. టోల్ అనేది కేవలం రాబడి మార్గంగా కాక, భద్రతకు హామీగా మారాలి. రోడ్ల నిర్మాణానికి వేల కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం, ప్రయాణికుల భద్రతకు బాధ్యత తీసుకోవడం లేదు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా గత సంవత్సరం 5,13,563 రోడ్డు ప్రమాదాలు జరిగి, సగటున ప్రతి గంటకు 21 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఈ సంఖ్య 5.3 శాతం పెరిగింది. వీటిలో దాదాపు 70 శాతం మరణాలు అతి వేగం వల్లే సంభవిస్తున్నాయని కేంద్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీటిల్లో లక్షలాదిమంది తీవ్ర గాయాలపాలై, సాధారణ జీవితానికి దూరమవుతున్నారు. అలాగే, జాతీయ గణాంకాల ప్రకారం...యువతే ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు (18-45 ఏళ్లు). కుటుంబాలను పోషించే వారే ఎక్కువగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదం. తెలుగు రాష్ట్రాల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ రవాణాశాఖ తాజా గణాంకాల ప్రకారం 2025లో రాష్ట్రవ్యాప్తంగా 18,398 ప్రమాదాలు నమోదు కాగా, అంతకు ముందు ఏడాది 18,460తో పోలిస్తే ప్రమాదాల సంఖ్య స్వల్పంగా తగ్గినా, మరణాలు 8,158 నుంచి 8,428కి పెరిగాయి. అంటే ప్రమాదాలు తగ్గినా వాటి తీవ్రత పెరుగుతోందన్నమాట. ప్రమాదాలు, మరణాల్లో తిరుపతి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. అలాగే, తెలంగాణలో 2023లో 22,903 రోడ్డు ప్రమాదాలు నమోదైతే, 2024 నాటికి ఆ సంఖ్య 25,986కి చేరింది. కేవలం ఏడాదిలోనే 13.5 శాతం పెరిగింది. అయితే, ఈ గణాంకాల వెనుక ఒక కుటుంబం, ఒక ఆదాయం, ఒక భవిష్యత్తు, ఎన్నో కన్నీళ్లు ఉన్నాయి. ప్రమాదాలను ముందుగానే అంచనా వేసే వ్యవస్థను పాలకులు రూపొందించాలి. ప్రమాద డేటాను కేంద్రీకరించి, సమయం, వాతావరణం, వాహనం, రహదారి రూపకల్పన, గాయాల తీవ్రత వంటి అంశాల ఆధారంగా విశ్లేషించాలి. ఈ సమాచారాన్ని జిల్లాల వారీగా ప్రజలకు విడుదల చేస్తేనే విధాన నిర్ణయాలు ఊహలపైగాక, ఆధారాలపై సాగుతాయి. కేంద్రం సూచించిన ఇ-డిఎఆర్ వంటి డేటా వ్యవస్థలు కేవలం రికార్డు నిల్వ కోసంగాక, ప్రమాద నిరోధక చర్యలకు మార్గదర్శకంగానూ ఉపయోగపడాలి.రోడ్డు టెర్రర్‌ను కేవలం ట్రాఫిక్ విభాగ సమస్యగా మార్చేయడం తగదు. ఇది ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక, రవాణా నిర్వహణ, కార్మిక హక్కులు, అత్యవసర వైద్యం, అన్నింటినీ తాకే భద్రతా సంక్షోభం. రహదారుల నిర్వహణ లోపాలను ప్రభుత్వాలు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఎఐ) సత్వరం సరిదిద్దాలి. ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలపై కఠిన నియంత్రణ, డ్రైవర్ల ఫిట్‌నెస్, విశ్రాంతి నిబంధనల కచ్చిత అమలు, రాత్రివేళల్లో వేగ నియంత్రణపై నిఘా తప్పనిసరి. టోల్ వసూలు చేసే సంస్థలు రహదారి భద్రతకు జవాబుదారీగా ఉండాలి.

# రాజ్యాంగ తిరస్కారం, రిపబ్లిక్ విధ్వంసం

భారత స్వాతంత్ర్య పోరాట క్రమంలో రూపొందిన సూత్రాల ఆధారంగా భారతీయ ప్రజాస్వామ్య స్వభావం ఏర్పడింది. రాజ్యాంగ పరిషత్తులో మూడేళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత రాజ్యాంగం స్థాపించబడటం యాదృచ్ఛికమేమీ కాదు. అలా రూపొందిన విలువలు, భావాల వ్యవస్థీకృత సారాంశమే అది. ప్రపంచంలో ప్రజాస్వామ్యాలు పాటిస్తున్న, అనుభవంలోకి వచ్చిన సూత్రాలలో కొన్నిటిని స్వీకరించడం, కొన్నిటిని పద్ధతులుగా స్థిరపర్చడం జరిగింది.




భారతీయ ప్రజాస్వామ్యం, దాని విస్తరణగా భారత రాజ్యాంగం మక్కీకి మక్కీగా పాశ్చాత్య పద్ధతులకు అనుకరణ ప్రతిలాంటివి కనుక పెద్దగా భారతీయమైనవి కాదనే వాదనకు భిన్నమైన వాస్తవం ఇది. ఆర్.ఎస్.ఎస్ దాని అధికార పత్రిక 'ఆర్గనైజర్' ప్రకటించిన భారతీయత చరిత్ర ముందు, వాస్తవాల ముందు నిలిచేదికాదు. రాజ్యాంగ పీఠిక 'భారతీయులమైన మేము' అనే మాటలతో ప్రారంభం కావడం యాదృచ్ఛికం కాదు. భారీ స్థాయిలో వున్న జనాభా, జనసంఖ్య భిన్నత్వం, సుసంపన్నమైన వైవిధ్యం గుర్తించే విధంగా రాజ్యాంగం రూపొందింది. ఆర్థిక, రాజకీయ, సార్వభౌమత్వం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్యతత్వ భావనలు మిళితం చేసుకున్న సంస్థాపక సూత్రాలు రూపొందాయి. ఏమైనా భారత ప్రజాస్వామ్యం పనిచేస్తున్న తీరుపై దేశంలోనే గాక ప్రపంచంలో వేర్వేరు చోట్ల సందేహాలు, విమర్శలు కూడా పెరుగుతున్నాయనే విషయంలో మరో మాటకు ఆస్కారమే లేదు. ప్రధానమైన ఆందోళన ప్రజాస్వామ్యం గురించీ, దానికి పునాదిగా నిలవాల్సిన ఒక మనిషికి ఒక ఓటు అనే సూత్రం గురించి.దీన్ని అమలు చేయడానికి కొన్ని ప్రక్రియలున్నాయి. భారత ఎన్నికల సంఘం అనే స్వతంత్ర సంస్థ 18 ఏళ్లు పైబడిన పౌరులందరూ ఓటర్లుగా చేర్చబడేట్టు చూడాలి. గతంలో ఎన్నికల ప్రక్రియ పైన ఏ ఫిర్యాదులూ లేవని కాదు. కానీ స్థూలంగా చెప్పాలంటే ఎన్నికల ఫలితంపై వివాదం లేదు. కానీ ఈ రోజు ప్రత్యేకించి ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర పరిశీలన (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)తో ప్రజల పరిశీలనాదృష్టిలో పెద్ద మార్పు వచ్చింది. పాలక కూటమి పాక్షిక ప్రయోజనాలకు అనుగుణంగా ఇసిఐ చేస్తున్న విపరీతమైన తప్పుల పరంపర ఇందుకు కారణమైంది.

**సమానతకు తిలోదకాలు**

ఈ దేశం ఏర్పడిన తర్వాత మొదటి సారిగా పశ్చిమబెంగాల్‌లో దాదాపు 30 లక్షల మందికి తాత్కాలికంగా ఓటు హక్కు తొలగించబడింది. తక్కిన దేశంలో సర్ ప్రక్రియ నడుస్తున్నది. ప్రాథమికంగా పదికోట్ల మంది ఓటరు జాబితాల నుంచి తొలగించబడ్డారు. సువ్యవస్థితమైన నిబంధనలు, పద్ధతులు దారుణంగా ఉల్లంఘించబడుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసిఐ వాటిని పట్టించుకోవడంలేదు. ఈ పరిణామంలో అత్యంత ఆందోళనకరమైన కోణం ఏమంటే మతపరమైన లెక్కలతో నిర్ణయాలు తీసుకోవడం, ప్రక్రియలు పాటించడం. పాలక పార్టీకి సంబంధించిన నాయకులు, మంత్రులు చాలా దుందుడుకుతనంతో కూడిన విద్వేష ప్రచారం సృష్టిస్తున్నారు. సమానత్వంతో కూడిన ఉమ్మడి పౌరసత్వం అనే సూత్రాన్ని దెబ్బతీసే వాతావరణం అంతటా వ్యాపింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మెజారిటీ ఆధిపత్య వాదం అంతకంతకూ స్వరం పెంచుతున్నది. అలా జరగడమంటేనే రాజ్యాంగాన్ని పూర్తిగా తిరస్కరించడం, తోసిపుచ్చడమే అవుతుంది.పౌరుల సమానత్వానికి సంబంధించిన మరో ముఖ్యమైన భాగం దశాబ్ది జనాభా లెక్కలు అనే ఇంకో రాజ్యాంగ కసరత్తుతో నిర్దేశితమైంది. జనాభాను లెక్క వేయడం, వారి సామాజిక, ఆర్థిక జీవిత కోణాలు పార్శ్వాలు వెలికితీయడం జరుగుతుంది. ప్రణాళిక, అభివృద్ధి ప్రక్రియకు సంబంధించిన కీలకమైన సమాచార వివరాలు అందించడంతో పాటు సామాజిక, ఆర్థిక సమానత్వం వైపు పయనించడమనేది తిరుగులేకుండా జరిగేలా చూడటం కూడా దీని ఉద్దేశం. రాష్ట్రాలవారీ ప్రాతినిధ్యంలో సమానత వుండేలా కూడా చూడటం జరగాలి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్దేశిత జనాభా ప్రక్రియ ఏడేళ్లు ఆలస్యమైంది. మొదట్లో కోవిడ్ -19 కారణంగా దాన్ని సకాలంలో ప్రారంభించలేకపోయామని వివరణ ఇచ్చారు. కానీ ఆ తర్వాత కూడా మరో ఆరేళ్ల పాటు ఆలస్యం కావడానికి సరైన కారణమే లేదు.

**జనాభా లెక్కల మాయ**

'సర్' ప్రక్రియ, జనాభా సేకరణ లెక్కలలో భాగమైన సొంత అంచనా, ప్రశ్నావళి కూడా అదివరకటి పద్ధతులకు స్పష్టమైన తేడాతో వుంది. ఉత్తర, దక్షిణ విభజనపై ఆధారపడిన చర్చ ఇప్పుడు ఇందుకు సందర్భం అవుతున్నది. కేవలం అంకెల ఆధారంగానే ప్రాతినిధ్య స్వభావం నిర్ణయించాలా లేక జాతీయ జనాభా విధానాన్ని ప్రోత్సహించే విధంగా మరేదైనా యంత్రాంగం తీసుకురావాలా? ఉత్తర భారతంలోని కొన్ని రాష్ట్రాలలో కనిపిస్తున్న జనాభా పెరుగుదలలో కనిపిస్తున్న కృత్రిమ పెరుగుదల తీరు ఈ సందేహాలకు తావిస్తున్నది. జాతీయ జనాభా విధానం అమలుచేస్తే ప్రోత్సాహం వుండేలా ప్రాధాన్యతనిస్తూ ఈ విషయమై కొత్తగా ఒక ఏకాభిప్రాయాన్ని తీసుకురావలసిన అవసరముందని చెప్పింది మరెవరో గాక స్వయంగా అద్వానీనే (జనాభా లెక్కల కమిషనర్‌కు, భారత రిజిస్ట్?ర్ జనరల్‌కు 2017లో సిపిఐఎం సమర్పించిన మెమోరాండంలో ఇందుకు సంబంధించిన సూచనలున్నాయి). జనాభా లెక్కల కీలక ప్రాధాన్యత ఏమంటే అది నియోజకవర్గాల పునర్విభజనతో విడదీయలేని విధంగా ముడిపడి వుంటుంది. నిజానికి మన రాజ్యాంగ అమరిక ప్రకారమైతే ప్రతి నియోజకవర్గ పునర్విభజన ప్రక్రియకు ముందు జనాభా లెక్కల సేకరణ జరగాలి. ఆ తాజా వివరాల ప్రాతిపదికపైనే పునర్విభజన జరగాలి. రాజ్యాంగం ఈ అంశాన్ని నిర్దిష్టంగా పేర్కొంటున్నది.నియోజకవర్గాల పునర్విభజన అనేది అన్ని రాష్ట్రాల పార్లమెంటరీ అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓటర్ల సంఖ్య స్థూలంగా, సమానంగా వుండేట్టు చూసేందుకు ఉద్దేశించింది. అంటే పరోక్షంగా సీట్ల విభజన అనేది రాజకీయ ప్రక్రియలో రాష్ట్రాల ప్రభావం ఇంచుమించు సమానంగా వుండేలా సమతుల్యంగా పంపిణీ జరిగేట్టు చూడటం దాని బాధ్యత. పారదర్శకత, హేతుబద్ధమైన ఒప్పుదల లేకుంటే ఈ తతంగం సహోదర యుద్ధంగా దిగజారే ప్రమాదం చాలా వుంటుంది. కనుక ఆ హేతుబద్ధమైన ఒప్పుదల ప్రక్రియ అధికారికంగా ఒక ఏకాభిప్రాయానికి దారితీయాలి. రాజ్యాంగ పీఠికలో స్వయంగా అంబేద్కర్ పొందుపర్చిన సహోదర భావన స్ఫూర్తి అదే.

**ఉనికికే చేటు**

కనుక ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. 'భారతీయులమైన మేము' అన్న దానికి రాజ్యాంగం అత్యధిక ప్రాధాన్యత నిచ్చింది. ఒక సమ్మిళిత ప్రజాస్వామ్యంలో ప్రజలు సమైక్యంగా జీవిస్తూ కలసిమెలసి కృషి చేయాలి. అదే రాజ్యాంగ నిర్దేశం కూడా. కానీ ప్రస్తుత పాలకవ్యవస్థ చేస్తున్న కసరత్తు వివక్షతా పూరితంగా వెలివేత పద్ధతులతో ముప్పు తెచ్చేలా తయారైంది. రిపబ్లిక్‌ను తిరగదోడడం స్పష్టంగా కనిపిస్తున్నది. దురదృష్టవశాత్తూ ఈ మొత్తం తతంగంలో కొందరు ఎక్కువ, కొందరు తక్కువ అనే భావనపై ఆధారపడి నడుస్తున్నది. వారి మతాన్ని సామాజిక, ఆర్థిక ప్రతిపత్తినీ, లింగభేదాన్ని బట్టి అసలు ఉనికే లేకుండా చేసేలా సాగుతున్నది. వెలుపలి వారు, చొరబాటుదారులతో భారత దేశ జనాభా నిండిపోయిందనే అభిప్రాయం కలిగిస్తున్నది. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో మితవాద అభివృద్ధి నిరోధక వర్గాలు వలసదారులకు వ్యతిరేకంగా సాగిస్తున్న విష ప్రచారాన్ని దాదాపుగా పోలిన పరిస్థితి ఇది. ప్రజల నిజమైన సమస్యలైన కూడు, గుడ్డ, నీడ, చదువు, ఆరోగ్యం వంటి కీలక ఆందోళనలను పక్కదోవ పట్టించే పని కనుక సంకేతాలు చాలా స్పష్టంగా, తీవ్రంగా వున్నాయి. ఒక వినాశకర పోకడ వైపు దేశాన్ని నడిపించే హానికర అంశాల ప్రాతిపదికగా భారతదేశాన్ని వెనక్కు మళ్లించే వ్యవహారం. దీనిపై యువ స్వరాలు జెన్ జీ, జెన్ ఆల్ఫా ఇప్పటికే పోరాట పతాకం ఎత్తడం కనిపిస్తూనే వుంది.

# భారత డేటా సెంటర్ల సవాలు:

## డిజిటల్ ప్రగతి - వనరుల సమతుల్యత

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరణ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతల వినియోగం పెరగడంతో భారతదేశంలో డేటా సెంటర్ల అవసరం గణనీయంగా పెరుగుతోంది. ఈ మౌలిక వసతుల విస్తరణ దేశ ఆర్థిక పురోగతికి, డిజిటల్ సార్వభౌమాధికారానికి ఎంతో కీలకమైనప్పటికీ, ఇది జల, విద్యుత్ వనరులపై తీవ్ర ఒత్తిడిని తెచ్చే అవకాశం ఉంది. 2032 నాటికి ఈ రంగానికి అవసరమయ్యే విద్యుత్ సామర్థ్యాన్ని అంచనా వేస్తూ, తగిన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం అత్యవసరం. 2020లో 375 మెగావాట్లుగా ఉన్న భారత డేటా సెంటర్ల సామర్థ్యం 2026 నాటికి 1,575 మెగావాట్లకు చేరుకునే దిశగా సాగుతోంది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2031-32 నాటికి ఇది 26.3 గిగావాట్లకు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం దాదాపు 9.3 గిగావాట్ల ప్రాజెక్టులు గ్రిడ్ అనుసంధానం కోసం వేచి ఉన్నాయి. ఈ భారీ విద్యుత్ డిమాండ్ జాతీయ గ్రిడ్ నిర్వహణ, ప్రసార నష్టాలు మరియు లోడ్ బ్యాలెన్సింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున గ్రిడ్ మౌలిక సదుపాయాల ఆధునికీకరణ ఆవశ్యకమవుతోంది.డేటా సెంటర్ల నిర్వహణలో సర్వర్లను చల్లబర్చేందుకు ప్రతిరోజూ అధిక మొత్తంలో నీరు అవసరమవుతుంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న తరుణంలో, పారిశ్రామిక ప్రాధాన్యతలకు, పౌరుల తాగునీటి అవసరాలకు మధ్య వనరుల పంపిణీ సమతుల్యంగా ఉండాలి. అలాగే, ప్రస్తుతం దేశంలో విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు ఆధారిత ప్లాంట్ల వాటా ఎక్కువగా ఉన్నందున, డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం కర్బన ఉద్గారాల పెరుగుదలకు దారితీసే ప్రమాదం ఉంది. 2070 నాటికి ఉద్గార రహిత లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ విభాగాన్ని పునరుత్పాదక ఇంధనం వైపు మళ్లించాల్సి ఉంటుంది.విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడానికి మరియు సాంకేతిక రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం పన్ను మినహాయింపులు, సబ్సిడీలను అందిస్తోంది. ఈ కేంద్రాలు ప్రత్యక్షంగా పరిమిత సంఖ్యలోనే ఉద్యోగాలను సృష్టించినప్పటికీ, పరోక్షంగా డిజిటల్ సేవల రంగంలో విస్తృతమైన ఆర్థిక విలువను జోడిస్తాయి. అయితే, కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు డేటా సెంటర్లను విస్తరించడం ద్వారా ప్రధాన నగరాల గ్రిడ్ మరియు జలవనరులపై ఒత్తిడిని సమర్థవంతంగా తగ్గించవచ్చు. ప్రాదేశికంగా వనరుల వికేంద్రీకరణ సత్వర డిజిటల్ వృద్ధికి, ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పడుతుంది.ప్రస్తుతం మెజారిటీ డేటా సెంటర్ల యాజమాన్యం విదేశీ సంస్థల చేతుల్లో ఉంది. జాతీయ భద్రత, పౌరుల వ్యక్తిగత డేటా రక్షణ దృష్ట్యా, దేశీయంగా డేటా నిల్వ ప్రాసెసింగ్ సౌకర్యాలను విస్తరించడం మరియు స్థానిక సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ముఖ్యమైన అంశాలుగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా సింగపూర్, ఐర్లాండ్, నెదర్లాండ్స్ వంటి దేశాల అనుభవాలను పరిశీలిస్తే, డేటా సెంటర్ల విస్తరణకు పర్యావరణ అనుమతులు మరియు వనరుల కేటాయింపుల్లో కఠినమైన ప్రామాణిక నిబంధనలు అమల్లో ఉన్నాయి. పర్యావరణ స్థిరత్వాన్ని కాపాడుతూనే సాంకేతిక మౌలిక వసతులను పెంపొందించడానికి అంతర్జాతీయ స్థాయిలో అనుసరిస్తున్న ఈ ఉత్తమ విధానాలను భారతదేశం కూడా స్వీకరించడం శ్రేయస్కరం.భారతీయ సందర్భంలో సమర్థవంతమైన పరిష్కారాలను సాధించడానికి విధానపరమైన చర్యలు అత్యవసరం. నీటి వినియోగాన్ని తగ్గించే లిక్విడ్ కూలింగ్, ఇమ్మర్షన్ కూలింగ్ మరియు డ్రై కూలింగ్ సాంకేతిక పద్ధతులను తప్పనిసరి చేయాలి. అలాగే డేటా సెంటర్లకు 100 శాతం సౌర, పవన విద్యుత్ కనెక్షన్లను అందించేలా గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ విధానాలను సులభతరం చేస్తూ కార్బన్ క్రెడిట్ వ్యవస్థను అమలు చేయాల్సి ఉంటుంది. దీనితో పాటు కేంద్రీకృత డేటా సెంటర్లపై భారాన్ని తగ్గించడానికి వికేంద్రీకృత ఎడ్జ్ నెట్‌వర్క్‌లను ప్రోత్సహించడం ప్రయోజనకరంగా ఉంటుంది. పరిశోధన మరియు అభివృద్ధి విభాగాలలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగ్యస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా స్వదేశీ సాంకేతికతలతో ఇంధన సమర్థత కలిగిన డిజిటల్ మౌలిక వసతులను నిర్మించవచ్చు. డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, పర్యావరణ పరిరక్షణ మరియు వనరుల సమర్థ నిర్వహణలను సమన్వయం చేసే సమగ్ర విధానం ద్వారా మాత్రమే భారతదేశం సమతుల్య డిజిటల్ ప్రగతిని సాధించగలదు.

(హెచ్.ప్రతాప్)

# హలో మాల - చలో సెక్రటేరియట్ కు భారీగా తరలి రండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలపై కక్ష సాధింపు చర్యలు మానాలి...
- జీవో నెంబర్ 99 మాలల భవిష్యత్తుని చిద్రం చేస్తుంది...
- రోస్టర్ ని సవరించే వరకు పోరాటం ఆగదు....
- జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు... పిల్లి సుధాకర్.





పాల్వంచ, ఆగస్టు 29, నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మాలల విద్య ఉద్యోగ అవకాశాలకు అడ్డంకి గా మారిన రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించాలని, మాలల భవిష్యత్తుని అంధకారం చేస్తున్న 99 జీవో ని ఎత్తివేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాలల విద్య, ఉద్యోగ అవకాశాలలో జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని కోరుతూ రేపు ( సోమవారం ) జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో జరిగే చలో సెక్రెటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దానిలో భాగంగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని లారీ అసోసియేషన్ హాల్లో చలో సెక్రెటేరియట్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరణ చేసి తప్పిదం చేయడమే కాక, రోస్టర్ పాయింట్లను కేటాయించడం, మాలల భవిష్యత్తుకు అంధకారంగా మారిన 99 జీవోని విడుదల చేసి మాలలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలపట్ల కక్ష సాధింపు చర్యలకు దిగారని విమర్శించారు. దశాబ్దాలకాలంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వెన్ను దన్నుగా నిలుస్తున్న మాలలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మాలలకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్ పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, రోస్టర్ పాయింట్లను 20 పాయింట్లు రెండు పాయింట్లు కేటాయించాలని, మాలల భవిష్యత్తుని చిద్రం చేస్తున్న 99 జీవోని ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాలల డిమాండ్ల సాధనకై రేపు ( సోమవారం ) జరిగే చలో సెక్రెటేరియట్ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా మాల విద్యార్థులు,ఉద్యోగులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుమల్ల సుందర్రావు,

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడెల్లి గణపతి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లంటి రమేష్, సింగరేణి రిటైర్డ్ మేనేజర్ శనగ వెంకటేశ్వర్లు, నాయకులు పెంకి శ్రీనివాస్, కాలే పుల్లయ్య, కూరపాటి దాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బోడ దివ్య, జిల్లా నాయకులు గుర్రం వెంకటరత్నం, శనగ రామచందర్, వల్లంటి హరీష్, గొర్రె ముచ్చు సుధాకర్, గడదేసి ప్రభాకర్, శెట్టి కమలాకర్, కాలే కాంతయ్య, గొల్లమల్ల రత్నం, జిల్లా యూత్ అధ్యక్షులు వాసుమల్ల గౌతం, దారా సాత్విక్, గుండమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు 2బిహెచ్‌కే ఇళ్లు

## మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు: బక్క వెంకటేశం







మేడ్చల్--మల్కాజిగిరి, ఆగస్టు 29:ల్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులకు తెలంగాణ ప్రభుత్వం 2బిహెచ్‌కే ఇళ్లను కేటాయించడం తొలిసారిగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో అమలు కావడం ప్రత్యేక గుర్తింపు అని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్క వెంకటేశం అన్నారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, మాన్యువల్ స్కావెంజర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులతో కలిసి అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి హాజరయ్యారు. పోలీసు, రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులతో డివిజన్ల వారీగా అట్రాసిటీ కేసుల పురోగతిని సమీక్షించారు. కుల ధృవీకరణ పత్రాలను త్వరితగతిన జారీ చేయాలని, పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే నిబంధనల ప్రకారం బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భౌతిక దాడులు, గంజాయి వంటి మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక నిఘా పెట్టాలని పోలీసులను ఆదేశించారు.

**బాధితులకు సత్వర న్యాయం**

బాధితులకు మానవతా దృక్పథంతో త్వరితగతిన న్యాయం అందించాలని, 2బిహెచ్‌కే ఇళ్లతో పాటు అర్హత మేరకు ఉపాధి, పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని బక్క వెంకటేశం సూచించారు. జిల్లాలో అవసరమైన అదనపు న్యాయస్థానాల ఏర్పాటుకు ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. ప్రతి మూడు నెలలకు డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఆదేశించారు.

**సఫాయి కర్మచారుల సంక్షేమంపై దృష్టి**


సఫాయి కర్మచారులకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, పీపీఈ, ప్రొటెక్టివ్ కిట్లతో పాటు వర్షాకాలంలో రైన్‌ప్రూఫ్ కిట్లు అందించాలని సూచించారు. మహిళా కర్మచారుల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ గదులు ఏర్పాటు చేయాలని కోరారు. డీవీఎంసీ సభ్యులు ప్రస్తావించిన ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు అదనపు కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్, డీవీఎంసీ సభ్యులు, ఆర్డీఓలు వెంకట రెడ్డి, శ్యాంప్రకాష్, పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 45వ ఛాంపియన్షిప్ పోటీలు ప్రారంభం



పటాన్ చెరువు ఆగస్టు 29 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: పటన్ చెరువులోని శ్రీ వాణి విద్యానికేతన్ హైస్కూల్లో తెలంగాణ రాష్ట్ర 45వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్టిక్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్-2026 పోటీలు శనివారం నాడు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక శాసనసభ్యులు మహిపాల్ రెడ్డి,మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి పోటీలు ప్రారంభించారు. ఈ నాయకులు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడలు శారీరక, మానసిక వికాసంతో పాటు క్రమశిక్షణ ఆత్మ విశ్వాసాన్ని పెంచుతాయని వారు కొనియాడారు.

# జర్నలిస్ట్ పిల్లలకు ఉచిత విద్య:డి.ఇ.ఓ



సంగారెడ్డి ఆగస్టు 29 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: 2026 27 విద్యా సంవత్సరంలో జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్ట్ ల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో ఉచిత విద్య అందించాలని సంగారెడ్డి జిల్లా విద్యాధికారిని రోహిణి శనివారం నాడు ఆదేశించారు! ఈ ఉత్తర్వులు జిల్లాలోని అన్ని మండలాల ఎం.ఈ.ఓ లోకు జర్నలిస్ట్ సంఘాల నాయకులకు మరియు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలకు పంపించారు. ఉచిత విద్యలో ఇబ్బందులు ఎదురైతే ఎం.ఈ.వోలను సంప్రదించాలని సూచించారు.

## సికింద్రాబాద్--శామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్‌కు భూములిచ్చిన యజమానులకు పరిహారం

### భూయజమానులకు రూ.96.5 కోట్ల పరిహారం చెక్కులు అందజేసిన కలెక్టర్ మను చౌదరి





మేడ్చల్--మల్కాజిగిరి, ఆగస్టు 29 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ వరకు రాజీవ్ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూములు ఇచ్చిన అల్వాల్ మండల భూయజమానులకు రెండో విడత పరిహారం చెక్కులను జిల్లా కలెక్టర్ మను చౌదరి అందజేశారు. శనివారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో డీఆర్వో మాలతితో కలిసి అల్వాల్ మండలానికి చెందిన 63 మంది భూయజమానులకు పరిహారం చెక్కులు అందజేశారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం మొత్తం 7,222 చదరపు గజాల భూమిని ఇచ్చిన భూయజమానులకు రూ.96.5 కోట్ల పరిహార నిధులకు సంబంధించిన చెక్కులను అందజేశారు. భూములు కోల్పోయిన అర్హులైన భూయజమానులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం పరిహారం అందించే ప్రక్రియలో భాగంగా ఈ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కారేపల్లి కేజీబీవీలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

### తెలుగు భాష దినోత్సవం.. గిడుగు వెంకట రామూర్తికి ఘన నివాళి.



కారేపల్లి ఆగస్టు 29 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ)లో తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ రఝానీ సౌజన్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి జన్మదినాన్ని తెలుగు భాష దినోత్సవం గా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలు తెలుగు భాష ప్రాముఖ్యత గురించి ఉపన్యాసం, డ్రామా, నృత్యాలు, పాటలు, వర్ణమాలతో కూడిన క్యాట్ వాక్ విద్యార్థినిలు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తెలుగు భాష గొప్పతనం, ప్రాధాన్యతను వివరిస్తూ ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాషా వైభవం, సాహిత్య విశిష్టత, మాతృభాషను పరిరక్షించాల్సిన బాధ్యత పై ప్రిన్సిపాల్ రఝానీ సౌజన్య విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిడుగు రామమూర్తి సేవలను స్మరించుకుంటూ తెలుగు భాష దినోత్సవం జరుపుకోవడం మన బాధ్యత అని తెలుగు భాష ప్రాముఖ్యత పై మరో సేవలు మరువలేని అని అన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అనే గర్వాన్ని నిలబెట్టుకుంటూ, తెలుగు భాషను మాట్లాడడం, చదవడం, రాయడం ద్వారా భావితరాలకు అందించడం మన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఝూన్సీ సౌజన్య, విజయలక్ష్మి, స్వాతి, అన్నపూర్ణ, విజయ మమత తదితరులు పాల్గొన్నారు.



## యాప్రాల్‌లో వేగ నియంత్రణకు బారికేడ్లు

### శ్రీ క్రిష్ ఎన్‌క్లేవ్ వాసుల విజ్ఞప్తికి స్పందన




యాప్రాల్, ఆగస్ట 29 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: యాప్రాల్‌లోని శైలి గార్డెన్స్‌కు వెళ్లే కాలనీ రోడ్డుపై వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలను నివారించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. శ్రీ క్రిష్ ఎన్‌క్లేవ్ నివాసితుల విజ్ఞప్తి మేరకు సమస్యను పరిశీలించి, వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించడంతో కాలనీ సంఘం నిబంధనల ప్రకారం బారికేడ్లను




ఏర్పాటు చేసింది. ఇటీవల రోడ్డును కొత్తగా నిర్మించి వెడల్పు చేయడంతో పాఠశాల బస్సులు, భారీ వాహనాలు, ఇతర వాహనాల రాకపోకలు పెరిగాయి. దీంతో అతివేగంతో వాహనాలు ప్రయాణించడం, అప్పుడప్పుడు చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. శుక్రవారం బారికేడ్ల ప్రారంభ కార్యక్రమానికి ఆహ్వానించగా, కాలనీ రోడ్డుపై వాటిని సరైన విధంగా ఏర్పాటు చేశారు. వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సమస్యపై జవహర్ నగర్ ట్రాఫిక్ సీఐ శివశంకర్ స్పందించి, వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం పట్ల సహకారం అందించారు. కార్యక్రమంలో శ్రీ క్రిష్ ఎన్‌క్లేవ్ అధ్యక్షుడు నాగేష్ వంగా, ఉపాధ్యక్షుడు దినేష్ రాథ్, కార్యదర్శి ఆరిఫ్ ఖాన్, కోశాధికారి క్రిస్టోఫర్ రాస్, సలహాదారు బి. నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పర్యవేక్షణతో అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి... మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

### రూ. 95.50 లక్షల సుడా నిధులతో రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల



ఖమ్మం, ఆగస్టు 29 నిర్భయవార్త రిపోర్టర్. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో రూ. 95.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు శనివారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి, పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు. నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ఎఫ్.ఎల్.న్ పై సమీక్ష




సంగారెడ్డి ఆగస్టు 29 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎఫ్.ఎల్.ఎన్ పై సమీక్ష సమావేశం శనివారం నాడు నిర్వహించారు. నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా భారతి హాజరై ఎఫ్.ఎల్.ఎన్ ఎలా బోధన చేయాలో ఎం.ఈ.ఓ లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి రోహిణి, సమగ్ర శిక్ష ఏ.ఎం.ఓ బాలయ్య, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి తదిల్లు పాల్గొన్నారు.

# షాది ఖానా అభివృద్ధికి, మైనార్టీ సంక్షేమానికి కృషి చేస్తా. చైర్మన్ యాకూబ్ ఆలీ

**కారేపల్లి షాదీఖానా చైర్మన్‌గా ఎన్నిక --- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు**




కారేపల్లి ఆగస్టు 29 నిర్భయవార్త రిపోర్టర్.కారేపల్లి షాదీఖానా నూతన చైర్మన్‌గా యాకూబ్ ఆలీ ఎన్నికైన సందర్భంగా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించేందుకు సహకరించిన ఎమ్మెల్యేకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.షాదీఖానా అభివృద్ధికి, మైనారిటీ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని నూతన చైర్మన్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో షాదీఖానాను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షాది ఖానా చైర్మన్ యాకుబ్ ఆలీ, వైస్ చైర్మన్ షేక్ మజీద్ పాషా, తాజుద్దీన్, ఎండి హనీఫ్, షఫీ, భీముడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దుస్తుల పంపిణీ



గుమ్మడిదల ఆగస్టు 29 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: కానుకుంట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరి ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు తీగ ఏక రూప దుస్తులను పంపిణీ చేశారు. కానుకుంట గ్రామ సర్పంచ్ పెంటరెడ్డి,ఏ.ఏ.పి.సి చైర్మన్ పూజ చేతుల మీదుగా విద్యార్థులకు శనివారం నాడు యూనిఫారాలను అందజేశారు. గ్రామ సర్పంచ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సమానత్వ భావన పెంపొందించడంతోపాటు పాఠశాలలపై అసక్తి పెంచేందుకు ఈ ఏకరూప దుస్తులు ఉపయోగపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్, పంచాయితీ వార్డ్ సభ్యులు, ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

# నిఘా కళ్లెదుటే 'పేకాట' జాతర: స్థానిక పోలీసులకు తెలియదా... తెలుసుకోలేకపోయారా?



అశ్వారావుపేట ఆగస్టు 29 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) అశ్వారావుపేట ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం జూదం, డ్రగ్స్, అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి.

**వేదాంతపురం అడవుల్లో భారీ పేకాట స్థావరం ధ్వంసం**

మండలంలోని వేదాంతపురం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో రహస్యంగా సాగుతున్న భారీ పేకాట స్థావరంపై జిల్లా టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా మెరుపు దాడి చేశారు.

**ఈ ఘటనలో:** 9 మంది అరెస్టు: స్థావరంపై దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు భారీగా ఆస్తులు స్వాధీనం: వారి నుంచి 1,22,310 నగదుతో పాటు 2 కార్లు, 16 ద్విచక్ర వాహనాలు, 16 మొబైల్ ఫోన్లను పోలీసులు చేసుకున్నారు.కేసు నమోదు: ఎస్ఐ టి. యయాతి రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**స్థానిక నిఘా వ్యవస్థపై మండిపడుతున్న ప్రజలు** టాస్క్‌ఫోర్స్ దాడితో అక్రమార్కుల్లో వణుకు మొదలైనప్పటికీ, స్థానిక పోలీసు నిఘా తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తెలియకనా నిర్లక్ష్యమా: పదుల సంఖ్యలో కార్లు, బైకులతో అటవీ ప్రాంతంలో అంత పెద్ద ఎత్తున జూదం సాగుతుంటే స్థానిక ఇంటెలిజెన్స్ అధికారులకు సమాచారం లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెరవెనుక హస్తముందా: పట్టుబడిన సొమ్ముకు, అక్కడ జరిగిన




అసలు లావాదేవీలకు తేడా ఉందనే ప్రచారం సాగుతోంది. కేవలం కింది స్థాయి వ్యక్తులను మాత్రమే చూపించి, అసలు సూత్రధారులను కాపాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సరిహద్దుల్లో నిరాటంకంగా మాఫియా దందాలు అశ్వారావుపేటను కేంద్రంగా చేసుకుని పలు అక్రమ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సహజ వనరుల దోపిడీ: ఇసుక, మట్టి మాఫియాలు దర్జాగా ప్రకృతి సంపదను తోడేస్తున్నాయి. నిషేధిత వస్తువుల అక్రమ రవాణా: గుట్కా, అక్రమ కోడిపందాలు, దొంగనోట్ల దందాలు సరిహద్దు దాటి యథేచ్ఛగా సాగుతున్నాయి. మొక్కుబడి తనిఖీలే కారణమా: అధికారులు తూతూమంత్రంగా దాడులు చేసి మమ అనిపించడం వల్లే అక్రమార్కులకు భయం లేకుండా పోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాడి తప్పిన యంత్రాంగాన్ని ప్రక్షాళన చేసి, అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, అశ్వారావుపేటను అసాంఘిక శక్తుల బారి నుండి కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# భద్రాచలంలో గోదావరి పుష్కర ఘాట్ల నిర్మాణాలు

**గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రారంభమైన పుష్కర పనులు**

**భూమిపూజా కార్యక్రమంలో పాల్గొన్న భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్,భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్**

**నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ పర్యవేక్షణలో రు. 46.65 కోట్లు నిధులతో ముడుదశల్లో ఘాట్ నిర్మాణాలు**



భద్రాచలం ఆగస్టు 29 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలంలో వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలు - 2027 కోసం ఏర్పాట్లలో భాగంగా ఘాట్ల నిర్మాణాలు శనివారం ప్రారంభమైనాయి. గోదావరి నది ఆయకట్టు పరివాహక ప్రాంతంలో ప్రారంభించిన ఈ పుష్కర పనుల కోసం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్,భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ క్రమంలో వేద పండితులు జిల్లా కలెక్టర్,భద్రాచలం ఎమ్మెల్యేతో పూజలు నిర్వహించారు.అనంతరం జే.సీ.బీ సహాయంతో మట్టిని తీసి పుష్కర పనులను అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. గోదావరి పుష్కరాలు 2027 కు మూడు విడతలుగా పనులను శ్రీకారం చుట్టామని తెలిపారు. అందులో భాగంగా తొలి విడుత పనులు రు. 46.65 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించిందని పేర్కొన్నారు.రెండో విడత పనులు రు. 1.75 కోట్లు,మూడో విడత పనులు రు. 60 లక్షలు మొత్తం రు.49కోట్లతో ఈ పుష్కర ఘాట్ పనులు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే ఈడాది మార్చ్ నెల లోపు ఈ పనులన్నీ పూర్తి కానున్నాయని వెల్లడించారు. మొదట భద్రాచలంలో పుష్కర ఘాట్ పనులు, అనంతరం దుమ్ముగూడెం మండలంలో పర్ణశాల, బూర్గంపాడు మండలంలో మోతే పట్టి నగర్ ప్రాంతాలలో ఘాట్ పనులు కొనసాగుతాయన్నారు.చివరగా ములుగు జిల్లాలోని చిన్నరావిగూడెం, రామానుజావరం, రామచంద్రాపురం ప్రాంతాలలో పుష్కర ఘాట్ పనులు జరగనున్నాయని తెలిపారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో వచ్చే ఏడాది 2027 జూన్, జూలై నెలలో నిర్వహించే గోదావరి పుష్కరాల భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పనులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. సరిహద్దు ప్రాంతాలైన వాజేడు, వెంకటాపురం ప్రాంతాలలో ఈ పుష్కర ఘాట్ పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం అభివృద్ధి మరమ్మత్తు పనులు రు. 351 కోట్లతో కొనసాగుతున్నాయని అన్నారు. ప్రతిరోజు జరుగుతున్న దేవాలయ మరమ్మత్తు పనులపై జిల్లా కలెక్టర్ అంకిత్, అధికారులు సమీక్షిస్తూ పనులు వేగవంతంగా చేపడుతునట్లు తెలిపారు. అదేవిధంగా గోదావరి పుష్కర పనులు సకాలంలో పూర్తిచేసేలా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పని చేయాలన్నారు.ముఖ్యంగా ఆర్ అండ్ బి అధికారులు భద్రాచలం కరకట్ట ప్రాంతంలో సర్వీస్ రోడ్డు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేలా ప్రణాళిక చేపట్టి చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా పుష్కరాలకు వచ్చే భక్తులకు సౌకర్యార్థం స్నానాల ఘాట్, మరుగుదొడ్ల తదితర వసతులన్నీ పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. భద్రాచలం ప్రాంతాన్ని కంటికి రెప్పలా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం టెంపుల్ ఈ.వో దామోదర్ రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ సీ.ఈ శ్రీనివాస్ రెడ్డి,ఎస్.ఈ మహేశ్వర రావు, డీ.ఈ సబ్ డివిజన్






-1 భాగ్యరాజ్ రాథోడ్,ఈ.ఈ జానీ, భద్రాచలం సర్పంచ్ పునేం కృష్ణ, పంచాయతీ ఈ.వో శ్రీనివాస్,తహసీల్దార్ రవి,వార్డు సభ్యులు సుబ్బా రావు, స్థానికులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, బుడగం శ్రీనివాస్,ఏ.ఈ.ఈ రవితేజ తదితరులు పాల్గొన్నారు..

# ఆటోలో అక్రమ మద్యం సరఫరా పై ఎక్సైజ్ శాఖ మౌనం

## సిండికేట్ అరికట్టడంలో ఎక్సైజ్ శాఖ విఫలం




కారేపల్లి ఆగస్టు 29 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండల కేంద్రంలో వైన్ షాపులు సిండికేట్ గా ఏర్పడి బెల్ట్ షాపులకు ఆటోలో మద్యం తరలిస్తూ ఎమ్మార్పీ ధరలకంటే అధికంగా విక్రయిస్తున్నారు. మండల ఉదయం 6 గంటలకు ,సాయంత్రం వేళల్లో కూడా బెల్ట్ షాపులకు విక్రయిస్తూ ఎమ్మార్పీ ధరలకంటే అధికంగా ఒక్కొక్క కోటర్ బాటిల్ 20 రూపాయల నుండి 30? రూపాయల వరకు అదనంగా విక్రయిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ అక్రమ రవాణాపై ఎక్సైజ్ శాఖ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడంతో సిండికేట్ వ్యవస్థ మూడు పూలు ఆరుకాయలుగా కొనసాగుతుంది. ఎక్సైజ్ శాఖ అక్రమ రవాణా పై దృష్టి పెట్టకపోవడంతో అధికారులు వైఫల్యానికి కారణమని మండల ప్రజలు భావిస్తున్నారు. శ్రీ కనకదుర్గ వైన్ షాప్ నుండి నిత్యం ఆటోలలో మద్యం బాక్సులను గ్రామాలకు తరలిస్తూ అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. సిండికేట్ వ్యవస్థకు ఎక్సైజ్ శాఖ ప్రోత్సాహమా? విధుల్లో నిర్లక్ష్యమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా ఆరోగ్యాలు దృష్టిలో ఉంచుకొని మద్యం సరఫరాపై, బెల్ట్ షాపుకు ఎంఆర్పి కంటే అధికంగా విక్రయించడం వల్ల సంబంధిత శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# చంచల్ గూడ జైలు మ్యూజియంను సందర్శించిన పేట్ బషీరాబాద్ సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు



పేట్ బషీరాబాద్, నిర్భయవార్త ప్రతినిధి : విద్యార్థుల్లో చట్టం, న్యాయం, సామాజిక బాధ్యత పట్ల అవగాహన పెంచేందుకు పేట్ బషీరాబాద్‌లోని సెయింట్ ఆన్స్ హైస్కూల్ విద్యార్థులు చంచల్ గూడ జైలు మ్యూజియంను సందర్శించారు. పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన ఈ క్షేత్ర పర్యటనలో (ఫీల్డ్ ట్రిప్) పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా జైలులోని క్రమశిక్షణ, ఖైదీల దినచర్య, వారి శిక్షా కాలంలో అమలు చేసే వివిధ సంస్కరణలు, వృత్తి విద్యా శిక్షణా కార్యక్రమాలను జైలు అధికారులు విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఖైదీలు తయారు చేసే ఉత్పత్తులు, వారి నైపుణ్యాల అభివృద్ధిని విద్యార్థులు స్వయంగా పరిశీలించారు. తప్పులకు దూరంగా ఉంటూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలి: జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా ఈ సందర్భంగా జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా సమాజంలో చట్టాలు, క్రమశిక్షణ యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. చిన్న తప్పు కూడా జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుందో జైలు వాతావరణం ప్రత్యక్షంగా తెలియజేస్తుంది. విద్యార్థులు నైతిక విలువలను పెంపొందించుకుని, భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం తమలో కొత్త ఆలోచనలను రేకెత్తించిందని, జీవితంలో క్రమశిక్షణతో పాటు సరైన మార్గంలో నడవాల్సిన అవసరాన్ని గుర్తించామని చెబుతూ జైలు అధికారులకు, పాఠశాల యాజమాన్యానికి విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్శన కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్ గౌడ్, జైలర్ దేవ్ సింగ్, స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ శాంతి, ప్రిన్సిపాల్ డాక్టర్ గాలి ఫెలసిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

## మెదక్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



మెదక్, టౌన్ :- నిర్భయవార్త ప్రతినిధి :రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మెదక్‌లో నిర్వహించిన రన్నింగ్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. వెల్‌కమ్ బోర్డు చౌరస్తా నుంచి ధ్యాన్‌చంద్ చౌరస్తా వరకు పురుషులకు 5 కి.మీ., కొత్త బస్టాండ్ నుంచి ధ్యాన్‌చంద్ చౌరస్తా వరకు బాలికలకు 2 కి.మీ. రన్నింగ్ నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని తెలిపారు.ధ్యాన్‌చంద్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. పోటీల్లో విజేతలకు మెడల్స్ అందజేశారు.ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్, యువజన క్రీడల అధికారి రమేష్, స్పోర్ట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలోని లోపాలను సరిదిద్ది అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలి..

---ఆర్డీఓ సైదిరెడ్డి కి బీజేపీ నాయకుల వినతి:

---పాల్గొన్నా మేడ్చల్ కాంటెస్టెంట్ ఏనుగు సుదర్శన్ రెడ్డి..



కీసర సర్కిల్ నిర్భయవార్త ప్రతినిధి : మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న (సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియలో నెలకొన్న లోపాలను వెంటనే సరిదిద్ది, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు శనివారం కీసర సర్కిల్‌లోని ఆర్ డి ఓ కార్యాలయంలో అధికారి సైదిరెడ్డి గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని 39 పోలింగ్ బూత్‌లలో రెండవ విడత (సర్) ప్రక్రియలో అనేక వ్యత్యాసాలు చోటుచేసుకున్నాయని నాయకులు అర్ డి ఓ దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో సుమారు 48 వేల మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య దాదాపు 33 వేలకు తగ్గడం, కేవలం సుమారు 9 వేల ఓట్లు మాత్రమే క్లియర్ కావడం, మిగిలిన దాదాపు 24 వేల మంది ఓటర్లకు నోటీసులు జారీ కావడం పట్ల ప్రజల్లో ఆందోళన నెలకొన్నదని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు ఆధారాలు సమర్పించేందుకు ఒక్కరోజు మాత్రమే గడువు ఇవ్వడం సరికాదని, తగినంత సమయం ఇవ్వాలని కోరారు. గతంలో ఓటు ఉండి, చెల్లుబాటు అయ్యే ఆధారాలు కలిగిన వారికి సైతం నోటీసులు జారీ అయిన సందర్భాలను ప్రత్యేకంగా పరిశీలించి, అర్హులైన వారి ఓట్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఒకే కుటుంబానికి చెందిన సభ్యులను వేర్వేరు పోలింగ్ బూత్‌లకు కేటాయించిన సమస్యలను పరిష్కరించి, సాధ్యమైనంత వరకు ఒకే కుటుంబానికి ఒకే పోలింగ్ బూత్ ఉండేలా చూడాలని కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బి ఎల్ ఓ లు, బిఎల్‌ఏ-2లకు ఆన్‌లైన్ డాక్యుమెంట్ అప్‌లోడింగ్, నిబంధనలు మరియు సాంకేతిక అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతతో పాటు చిరునామా మార్పులు చేసుకున్న అర్హులైన పౌరులకు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండా ఓటర్ల జాబితాలో అవకాశం కల్పించాలని కోరారు. "అర్హుడైన ఒక్క ఓటరు కూడా మిగలకూడదు.. అనర్హుడైన ఒక్క ఓటరు కూడా ఉండకూడదు" అనే లక్ష్యంతో (సర్) ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన ఏ ఒక్క పౌరుడూ ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అర్ డి ఓ ను కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కంటెస్టెడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, నాగారం మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా కార్యాలయ కార్యదర్శి గాలి సంపత్ యాదవ్, నాగారం మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, కీసర డివిజన్ బీజేపీ అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్, బిలకంటి ధర్మేందర్, తడాఖ కృష్ణ, తాటి ఆనంద్, చక్రపాణి, కర్ణాకర్, బాలయ్య, సాయి కృష్ణ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ దుర్గాదేవి శ్రీ పోచమ్మ తల్లి అమ్మ వార్ల విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన మహోత్సవాలు



సదాశివపేట నిర్భయవార్త ప్రతినిధి :సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణం హనుమాన్ నగర్ కాలనీలోశ్రీ దుర్గా దేవి శ్రీ పోచమ్మ అమ్మ వార్ల విగ్రహ ప్రాణ ప్రతి స్టాపన ప్రారంభ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం నుండి విగ్రహాలు కళశాల ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు భక్తులు మాట్లాడుతూ. శ్రీ దుర్గా దేవి శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం అమ్మ వార్ల విగ్రహ ప్రతిష్టాపన ఆహ్వాన భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం నాడు ఉదయం నుండి. పూజలు గణపతి పూజ హోమం అనంతరం అన్నదాన తీర్థప్రసాదాలు స్వీకరించామని అన్నారు ఈ కార్యక్రమంలో సదాశివపేట గ్రామ ప్రజలు తదితరులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# జంటనాగుల 6వార్షికోత్సవంలో పాల్గొన్న 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత



సదాశివపేట నిర్భయవార్త ప్రతినిధి : సంగారెడ్డి జిల్లాసదాశివపేట పట్టణం పాతకేరిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో నెలకొని ఉన్న జంటనాగుల విగ్రహ ప్రతిష్ఠ 6వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు దంపతులు జంటనాగులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇట్టి సందర్భంగా పులిమామిడి మమత మాట్లాడుతూ ఇక్కడ ఎల్లమ్మ తల్లి స్వయంబుగా వెలసి ఉన్నారని, కోరిన కోరికలు నెరవేరుస్తూ కొంగు బంగారమై నిలుస్తుందన్నారు. అమ్మవారు చెప్పిన విధంగా ఆలయ ప్రాంగణంలో జంటనాగులను ప్రతిష్టించామని, ఈ నాగులను పూజించి నట్లయితే వారికి సంతానం కలుగుతుందని పులిమామిడి మమత అన్నారు.అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు మహా ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జంటనాగులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం ఆలయ అధ్యక్షులు తంగడపల్లి మనోహర్ గౌడ్, కళావతి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో పద్మ మాణిక్యం, పరమదాసు, సంగమేష్, మాణయ్య, మడుపతి బ్రహ్మం స్వామి, మహిళలు శశికళ, రాణి, లక్ష్మమ్మ, జయమ్మతో పాటు పీఎంఆర్ యువసేన నాయకులు తాలెల్మ రాము, అనిల్, గుణాకర్, అఖిల్, చెన్వీర్, సోమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## "టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు.పరుచూరి ప్రసాద్ నివాసానికి వెళ్లి.పరామర్శించిన.ఎమ్మెల్యే బొండా ఉమా



నిర్భయవార్త ప్రతినిధి :ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర టీఎన్టీయూసీఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు పరుచూరి ప్రసాద్‌ను విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండాఉమామహేశ్వరరావు.ఇటీవల . టి ఎన్ టి యుసి నాయకుడు పరుచూరి ప్రసాద్ కాలికి శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకున్న బొండా ఉమా శనివారం ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారుపరామర్శించారు. ఆపరేషన్ వివరాలతో పాటు ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ.. పార్టీకి, కార్మికుల సంక్షేమానికి నిరంతరం సేవలందిస్తున్న సీనియర్ నాయకులు పరుచూరి ప్రసాద్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతోకోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలనిసూచించారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు,టీఎన్టీయూసీ ప్రతినిధులుఈ పరామర్శ కార్యక్రమంలో పాల్గొని పరుచూరి ప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

## ఎమ్మెల్యే సుజనా కార్యాలయం ప్రత్తిపాటి శ్రీధర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన టిడిపి నాయకులు



నిర్భయవార్త ప్రతినిధి : ఎన్టీఆర్ జిల్లా విజయవాడపశ్చిమ. శాసనసభ్యులు వై. సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పలువురు తెలుగుదేశం నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలుతెలియజేశారు. భవానిపురంలోని బిజెపి కార్యాలయంలో శ్రీధర్ ను శాలువాతో వారు సత్కరించారు. పశ్చిమనియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశం కృషి చేస్తున్న ప్రత్తిపాటి శ్రీధర్ నిండు నూరేళ్ళు ఆయురారోగ్యఐశ్వర్యాలతోవిలసిల్లాలనిఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోతెలుగుదేశం ఎన్టీఆర్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పేరాబత్తుల రమణ, తెలుగుదేశం నాయకులు మైలవరపు వీరబాబు, 47వ డివిజన్ తెలుగుదేశం సీనియర్ నాయకులు సగురుపిళ్ళ రమేష్,.. మైలవరపు వీరబాబు... తెలుగు యువత నాయకులు రాయన రాజా తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లా ఆర్చరీ జట్టుకు అభినందనలు.

### సింహపురి కెన్ని స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో క్రీడల్లో అద్భుత ప్రదర్శన.

నెల్లూరు, నిర్భయవార్త ప్రతినిధి :అమరావతి ఆర్చరీ స్టేట్ ఛాంపియన్‌షిప్--2026 తిరుపతిలో 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించబడింది. ఈ పోటీల్లో అండర్--23 విభాగంలో వి. జ్యోతి, అమూల్య, నవ్య, అంజలితో కూడిన నెల్లూరు జిల్లా ఆర్చరీ జట్టు




వెండి పతకం సాధించింది. ఈ సందర్భంగా ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారిణులకు పతకాలు, మెడల్స్ మరియు సర్టిఫికెట్లు అందజేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ అనిమిని రవి నాయుడు క్రీడాకారిణులను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా క్రీడాకారిణులకు వెండి పతకం, మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. సింహపురి కెన్ని స్పోర్ట్ అకాడమీ అధినేత, నెల్లూరు జిల్లా జట్టు కోచ్ ధనుష్ మార్గదర్శకత్వంలో ఈ విజయం సాధించడం అభినందనీయం. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి నెల్లూరు జిల్లాకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వి. జ్యోతి ను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఆమె అద్భుతమైన ప్రతిభ, పట్టుదల, క్రీడాస్ఫూర్తిని వారు ప్రశంసించారు. జట్టు విజయానికి ఆమె అందించిన కీలక సహకారం అభినందనీయం అన్నారు.

## ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ సమావేశాలకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలి.

### రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు.

పుంగనూరు, నిర్భయవార్త ప్రతినిధి :.పుంగనూరు మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల తహసిల్దార్ రాము అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జస్టిన్ పున్నయ్య కమిషన్ సిఫారసుల మేరకు ప్రతి నెలా మండలంలోని అన్ని ప్రభుత్వ



శాఖల అధికారులతో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రతి నెల చివరి వారంలో ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించి, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు చట్టాలు, హక్కులు, అట్రాసిటీ నిరోధక చట్టంపై అవగాహన కల్పించాలని కోరారు.సమావేశాలకు గైర్హాజరవుతున్న అధికారులకు తహసిల్దార్ షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఇకపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేస్తే ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. సమావేశాలకు హాజరుకాని అధికారులపై నిబంధనల ప్రకారం సెక్షన్ 4 కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా పుంగనూరు మున్సిపాలిటీలో రిజర్వేషన్ నిబంధనలు (రూల్ ఆఫ్ రిజర్వేషన్) సక్రమంగా అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.త్వరలో జిల్లాలో ఎస్సీ కమిషన్ పర్యటన ఉన్నందున, ఇకపై జరిగే విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలకు అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి రికార్డులు, సంబంధిత ఫైల్స్‌తో హాజరు కావాలని శ్రీనివాసులు సూచించారు.అనంతరం తహసిల్దార్ రాము మాట్లాడుతూ ఇకపై జరిగే ప్రతి సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని, గైర్హాజరైన అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖ అధికారులు ఎస్పై ఆన్సర్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ మరియు మండల ప్రభుత్వ శాఖా అధికారులు మరియు ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చిన్న రాయుడు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్, దళిత ,గిరిజన నాయకులు రామయ్య, రమణ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులు ఆరోగ్యం పై మంత్రి దృష్టికి కీలక సమస్యలు.

అరకు,పాడేరు, అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి ;:.రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న



వైద్య సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, మారుమూల ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకర్ డైరెక్టర్ శ్రీ కూడ కృష్ణారావు కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రివర్యులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న వైద్య సేవల కొరత, ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల సమస్యలు, వైద్యులు మరియు సిబ్బంది అందుబాటు, అత్యవసర వైద్య సేవలు, మారుమూల ప్రాంతాల నుంచి ఆసుపత్రులకు రవాణా తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.ప్రత్యేకంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు, అవసరమైన వైద్య పరికరాలు, మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో గిరిజన ప్రజలకు సకాలంలో వైద్యం అందించేందుకు అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు మెరుగుపడితే ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని, చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు కూడా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని కృష్ణారావు తెలిపారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి మారుమూల గ్రామానికి వైద్య సేవలు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.గిరిజన ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కృష్ణారావు పేర్కొన్నారు. గిరిజనుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## రైతులకు సేంద్రియ ఎరువుల పంపిణీ.

### రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.



నందిగామ, నిర్భయవార్త ప్రతినిధి : నందిగామ మార్కెట్ యార్డులో రైతులకు సేంద్రియ ఎరువులను పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మార్కెట్ యార్డు పాలకవర్గ సభ్యులు, అధికారులతో కలిసి రైతులకు ఎరువులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరగడంతో పాటు సూక్ష్మజీవుల అభివృద్ధి, పంటలకు అవసరమైన పోషకాల లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. రసాయన ఎరువులపై అధిక ఆధారపడకుండా, భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగంతో సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని సూచించారు.మన భూమి--మన బాధ్యత అనే స్ఫూర్తితో వ్యవసాయ భూముల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, రైతు సంక్షేమానికి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే సౌమ్య పేర్కొన్నారు.

## ప్రజలకు భారంగా మారిన ఇంటి పన్ను డకుళాయి పన్ను.

### మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగి నిర్లక్ష్యపు సమాధానం.. పేదల ఆవేదన.

నందిగామ, నిర్భయవార్త ప్రతినిధి :.ఇంటి పన్ను కట్టడానికి వచ్చిన




పేద ప్రజలకు నందిగామ మున్సిపల్ కార్యాలయంలో చేదు అనుభవం ఎదురవుతోంది. పన్ను కట్టించుకునే ఉద్యోగి నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.పట్టణంలో చాలా మంది తమకు ఉన్న కొద్దిపాటి డబ్బుతో ఇంటి పన్ను కట్టేందుకు మున్సిపాలిటీకి వస్తున్నారు. అయితే అక్కడ కౌంటర్లో ఉన్న ఉద్యోగి ఇంటి పన్ను ఒక్కటే కాదు.. కుళాయి పన్ను కూడా కలిపి కట్టాల్సిందే.. లేకపోతే కట్టించుకోం అంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నారని ప్రజలు వాపోతున్నారు."మా పరిస్థితి బాగోలేదు.. ముందు ఇంటి పన్ను కట్టించుకోండి, కొన్ని రోజుల తర్వాత కుళాయి పన్ను కడతాం" అని బతిమాలినా వినే పరిస్థితి లేదని పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాళ్లు అరిగేలా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినా పన్ను కట్టించుకోకపోవడంతో తప్పక నెట్ సెంటర్ కు వెళ్లి గంటల తరబడి వేచి ఉండి కట్టుకునే దుస్థితి ఏర్పడిందని మండిపడుతున్నారు.ఒకపక్క ప్రభుత్వం ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రచారం చేస్తుండగా, మరోపక్క ఇలాంటి ఉద్యోగుల తీరు వల్ల ప్రజలు పన్ను కట్టాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది. పేదలు ఒకేసారి రెండు పన్నులు కట్టలేరని, మానవతా దృక్పథంతో ముందు ఇంటి పన్ను కట్టించుకుని, కుళాయి పన్నుకు కొంత గడువు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.దీనిపై మున్సిపల్ కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కాఫీ రైతు కష్టాల్లో వ్యాపారులా ఖాతాల్లో కోట్లు.

### గొప్పలు చెప్పుకునే ఘనత కూటమికే దక్కుతుంది .

పాడేరు,అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి :.అల్లూరి జిల్లా పాడేరు వైసీపీ క్యాంప్ కార్యాలయంలో పాడేరు నియోజకవర్గ వైసీపీ మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మీడియా సమావేశం నిర్వహించి సీఎం చంద్రబాబు ఏజెన్సీ పర్యటనపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కొత్త ప్రకటనలతో గిరిజనులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం, అందుకు కేంద్రం నుంచి వచ్చే నిధుల గురించి కూడా ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రతి ఇంటికీ సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని, ఏజెన్సీలో అనేక ప్రాంతాల్లో ఏడాదిలో సుమారు ఆరు నెలలు వర్షాకాల పరిస్థితులు ఉండి ఎండ కూడా సరిగా కనిపించని ప్రాంతాలు ఉన్నాయని, అలాంటి ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సోలార్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు.గంజాయి నిర్మూలనపై కూడా ప్రభుత్వం మాటలకే పరిమితమైందని విమర్శించిన ఆమె, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో గంజాయి నిర్మూలిస్తామని ప్రకటించారని, వైసీపీ హయాంలో ఎంత నిర్మూలన జరిగిందో, ప్రస్తుత ప్రభుత్వం ఎంత చేసిందో లెక్క తేల్చేందుకు వైసీపీ సిద్ధంగా ఉందని సవాల్ చేశారు. ప్రస్తుతం ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో కూడా గంజాయి ప్రభావం పెరిగిందని, విద్యార్థులు, యువతపై దాని ప్రభావం తీవ్రంగా ఉందని అన్నారు.గిరిజనుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించిన భాగ్యలక్ష్మి, గతంలో అరకు పర్యటనలో జీవో నంబర్--3పై హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని విమర్శించారు. ప్రస్తుత పర్యటనలో కూడా జీవో నంబర్--3పై సీఎం మాట్లాడకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రైతులకు రూ.20 వేల అన్నదాత సుఖీభవ సాయం ఇస్తామని చెప్పినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదని, కేంద్రం నుంచి వచ్చే రూ.7,500 మాత్రమే అందుతున్నాయని ఆరోపించారు.కాఫీ ఉత్పత్తిని రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కాఫీ పండిస్తున్న గిరిజన రైతులు మాత్రం నేటికీ పేద రైతులుగానే ఉన్నారని భాగ్యలక్ష్మి అన్నారు. జీసీసీ ద్వారా కాఫీ కొనుగోళ్లు తక్కువగా జరుగుతున్నాయని, ప్రైవేట్ వ్యాపారులు, పెద్ద వ్యాపారులు మాత్రం కాఫీ వ్యాపారంతో కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. రైతులకు కొత్తగా ఏం చేశారో ప్రభుత్వం చెప్పాలని, కాఫీ రైతులకు ప్రయోజనం కల్పించకుండా కాఫీని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లామని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.అలాగే కొండపోడు భూములకు సంబంధించిన పట్టాలను నేటికీ పూర్తిస్థాయిలో రైతులకు అందించలేదని ఆమె అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది పట్టాలు ఇచ్చామని పేర్కొన్న భాగ్యలక్ష్మి, ప్రస్తుత ప్రభుత్వం గిరిజన రైతుల సమస్యలను




పరిష్కరించకుండా మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు.మారుమూల ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా మందులు పంపుతున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఏజెన్సీలో వైద్య సమస్యలు కొనసాగుతున్నాయని అన్నారు. వైసీపీ హయాంలో మంజూరైన మెడికల్ కాలేజీ పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిచేసి ప్రజలకు పూర్తిస్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నా కనీసం దోమల నివారణ మందులు సక్రమంగా పిచికారీ చేయడం లేదని, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు కూడా అనారోగ్యానికి గురైన సంఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు.గిరిజనుల ఆరోగ్యం, అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మెడికల్ కాలేజీని పూర్తి చేసి, జీవో నంబర్--3కు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక జీవో తీసుకొచ్చి వంద శాతం గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రజలు తమకు ఓటు వేయలేదనే కక్షతోనే అభివృద్ధి పనులను నగం నగంగా చేస్తున్నారనే భావన ప్రజల్లో ఉందని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అన్యాయం, కక్ష సాధింపు పాలనను గిరిజనులతో పాటు రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగరడం ఖాయమని భాగ్యలక్ష్మి అన్నారు. టీడీపీ ప్రభుత్వ హామీలు, వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని,



# నిద్రలో లేచి వెళ్లి ఆ హీరో ఏం చేస్తాడో తెలిస్తే షాకింగే!

నటుడు, దర్శకుడు శ్రీనివాస్ అవసరాల ఇటీవల విడుదల చేసిన ఒక వీడియో సందేశం టాలీవుడ్‌లో తీవ్ర ఉత్సుకతను రేకెత్తిస్తోంది.నటుడు, దర్శకుడు శ్రీనివాస్ అవసరాల ఇటీవల విడుదల చేసిన ఒక వీడియో సందేశం టాలీవుడ్‌లో తీవ్ర ఉత్సుకతను రేకెత్తిస్తోంది. సస్పెన్స్ థ్రిల్లర్ -టార్టాయిస్- ప్రమోషన్లలో భాగంగా అతడు మాట్లాడిన మాటలు, అందులోని ఆసక్తికర అంశాలు సోషల్ మీడియాలో వైరల్‌గా ప్రచారమవుతున్నాయి. 4 శ్రీనివాస్ అవసరాల తన వీడియోలో ఒక యువ హీరో గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. సదరు హీరో తనకు మంచి మిత్రుడని పేర్కొంటూ అతనొక విచిత్రమైన సమస్యతో బాధపడుతున్నట్లు వెల్లడించారు. నిద్రలో నడిచే వ్యాధి (స్లీప్‌వాకింగ్) వల్ల ఆ హీరో రాత్రిపూట తెలియకుండానే వీధుల్లోకి వచ్చేస్తున్నాడని చెప్పాడు. రాత్రి ఒంటి గంట లేదా రెండు గంటల సమయంలో హైదరాబాద్ రోడ్లపై ఆ హీరో నిద్రలోనే -జాంబీ-లా నడుస్తూ కొందరికి కనిపించాడని శ్రీనివాస్ అవసరాల చెప్పారు. అయితే అతడి పరిస్థితిని అర్థం చేసుకోవాలని, అర్ధరాత్రి వేళ రోడ్లపై కనిపిస్తే ఎవరూ తప్పుగా భావించవద్దని ప్రజలు, అభిమానులను కోరారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైర్ కావడంతో ఆ హీరో ఎవరై ఉంటారనే దానిపై నెటిజన్లు రకరకాల అంచనాలు వేస్తున్నారు. నిద్రలో నడుస్తూ హత్యలు చేసే ఒక యువ హీరో కథాంశంతో -టార్టాయిస్- సినిమా రూపొందుతోందని సమాచారం. తాజా ప్రమోషనల్ వీడియో ఆ కాన్సెప్ట్‌ను చాలా ఆసక్తికరంగా ప్రేక్షకుల్లోకి తీసుకెళుతోంది. అలాగే ఆ హీరో ఎవరో కనిపెట్టి కామెంట్ సెక్షన్లలో గెస్ చేయాలని శ్రీనివాస్ అవసరాల ప్రేక్షకులను ఆహ్వానించారు. లహరి మ్యూజిక్ అందిస్తున్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాపై ఈ వినూత్న ప్రచారం ద్వారా భారీ అంచనాలు పెరిగాయి. 30 ఆగస్టు సస్పెన్స్ కి తెరదించుతామని అన్నారు. హీరో ఎవరో వేచి చూడాలి. అవసరాల శ్రీనివాస్ కెరీర్ జర్నీ: అమెరికాలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివి.. అక్కడే ప్రిన్స్‌టన్ ప్లాస్మా ఫిజిక్స్ ల్యాబొరేటరీలో ఉద్యోగం చేస్తూ.. సినిమాపై ఉన్న ఆశయంతో స్క్రీన్ రైటింగ్ కోర్స్ పూర్తిచేసి టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు అవసరాల శ్రీనివాస్. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో వచ్చిన -అష్టా చమ్మా- (2008) చిత్రంతో నటుడిగా వెండితెరకు పరిచయమైన ఆయన తొలి సినిమాతోనే తన నటనతో ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు. ఆ తర్వాత -పిల్ల జమీందార్-, -అంతకుముందు ఆతరువాత-, -కంచె- వంటి చిత్రాలలో సహాయ నటుడిగా, కామెడీ క్యారెక్టర్లలో నటించి మెప్పించారు.మెగాస్టార్ తర్వాత అల్లు అర్జున్‌కే ఆ ఛాన్స్? కేవలం నటుడిగానే కాకుండా దర్శకుడిగా, రచయితగా మారిన శ్రీనివాస్.. -ఊహలు గుసగుసలాడే- చిత్రంతో మెగాఫోన్ పట్టి బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకున్నారు. తొలి సినిమాతోనే తనదైన మేకింగ్ స్టైల్‌ను చూపిస్తూ బెస్ట్ డెబ్యూ డైరెక్టర్‌గా నంది అవార్డును కూడా గెలుచుకున్నారు.




# అప్పుడు ఆమె బ్లాక్‌బస్టర్..

ఇప్పుడు భర్తతో తొలి చిత్రం 'దేవదాసు'తో బ్లాక్‌బస్టర్ కొట్టినప్పటికీ.. ఆ తర్వాత సరైన విజయం లేక ఇబ్బంది పడుతున్న టైంలో 'రెడీ'తో భారీ విజయాన్ని అందుకున్నాడు. యువ కథానాయకుడు రామ్ కెరీర్లో చాలా స్పెషల్ మూవీ.. రెడీ. తొలి చిత్రం 'దేవదాసు'తో బ్లాక్‌బస్టర్ కొట్టినప్పటికీ.. ఆ తర్వాత సరైన విజయం లేక ఇబ్బంది పడుతున్న టైంలో 'రెడీ'తో భారీ విజయాన్ని అందుకున్నాడు. అన్ని రసాలూ కలిసిన ఈ చిత్రం.. పెద్ద హీరోలు నటించిన సూపర్ హిట్ సినిమాల స్థాయిలో ప్రేక్షకులను అమితంగా అలరించింది. ఈ చిత్రంలో తనతో జంట కట్టిన జెనీలియాకు రామ్ క్లోజ్ ఫ్రెండ్ అయ్యాడు. ఆమెను తన లక్కీ ఛార్మ్‌గా భావిస్తాడు రామ్. ఇప్పటికీ జెన్నీతో రామ్ స్నేహం కొనసాగుతోంది. ఆ స్నేహంతోనే జెన్నీ భర్త రితేష్ దేశ్‌ముఖ్‌కు తెలుగు సినిమాలో అవకాశం కల్పించాడట రామ్. ఈ ఎనర్జిటిక్ స్టార్ కెరీర్లో తొలిసారిగా మెగా ఫోన్ పట్టి ఓ సినిమా తీస్తున్న సంగతి తెలిసిందే. 'లోన్ వూల్ఫ్' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమా చిత్రీకరణ కోసమే రితేష్ ఇటీవలే హైదరాబాద్‌లో అడుగుపెట్టాడు. ఈ చిత్రంలో రితేష్‌ది నెగెటివ్ రోల్ అని సమాచారం. కొంచెం సైకో లక్షణాలతో ఆ పాత్ర ఉంటుందట. ఇలాంటి పాత్రను రితేష్ బాగా చేయగలడని 'ఏక్ విలన్' సినిమాతోనే రుజువైంది. ఒక దశలో రితేష్ కెరీర్ ముగిసిపోతున్న సంకేతాలు కనిపించాయి కానీ.. స్వీయ దర్శకత్వంలో రూపొందిన మరాఠీ చిత్రం 'వేద్' (మజిలీ రీమేక్)తో భారీ విజయాన్నందుకున్నాడు. ఈ ఏడాది దర్శకుడిగా ఛత్రపతి శివాజీ పాత్రలో నటిస్తూ తీసిన సినిమా కూడా ఓ మోస్తరు ఫలితాన్నందుకుంది. బాలీవుడ్లో అతడికి అవకాశాలకు లోటేమీ లేదు.



ఇలాంటి టైంలో తొలిసారిగా నటించబోతున్నాడు రితేష్. ఈ చిత్రాన్ని రామ్ సొంత బేనర్లో నిర్మిస్తుండడం విశేషం. తన సోదరుడే ఈ మూవీని ప్రొడ్యూస్ చేస్తుండగా.. బడ్జెట్ రూ.100 కోట్లని వార్తలు వస్తున్నాయి. ఇందులో రామ్ డిఫరెంట్ లుక్స్, షేడ్స్‌తో సాగే పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.




# 150 ఏళ్లుగా రాజవంశంలోని మరణాలు..

నిజంగా జరిగిన కథతో తెరకెక్కించారా? టాలెంటెడ్ నటుడు సుమంత్ కథానాయకుడిగా.. సంతోష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఆధ్యాత్మిక మిస్టరీ థ్రిల్లర్ -మహేంద్రగిరి వారాహి-. టాలెంటెడ్ నటుడు సుమంత్ కథానాయకుడిగా.. సంతోష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఆధ్యాత్మిక మిస్టరీ థ్రిల్లర్ -మహేంద్రగిరి వారాహి-. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలివు మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ వేడుక ఇటీవల ఘనంగా జరిగింది. ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ను ఆవిష్కరించారు. -డివైన్ ఎలిమెంట్స్- తో అద్భుతంగా ఉన్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని వెంకీ అట్లూరి ధీమా వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో 150 ఏళ్లుగా ఒక రాజవంశంలో వరుసగా జరుగుతున్న అనుమానాస్పద మరణాల వెనుక ఉన్న అసలు మిస్టరీని ప్రధాన కథాంశంగా చూపించారు. వారణాసి గ్రామదేవతగా, పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరి పర్వతాలపై కొలువుదీరిన వారాహి మాత శాపం వల్లే ఈ రాజకుటుంబంలో మరణాలు సంభవిస్తున్నాయని స్థానికులు నమ్ముతుంటారు. ఈ శాపాన్ని ఛేదించి, మరణాల వెనుక ఉన్న అసలు నిజాన్ని బయటపెట్టేందుకు హీరో దైవశక్తినే ఎదుర్కొనే సాహసం చేయడం కథలోని ప్రధాన ఉత్కంఠను పెంచుతోంది. భక్తి, విశ్వాసం, మిస్టరీ, సస్పెన్స్ ఎలిమెంట్స్‌ను దర్శకుడు సంతోష్ జాగర్లమూడి అద్భుతంగా బ్యాలెన్స్ చేశారు. అయితే -మహేంద్రగిరి వారాహి- చిత్రాన్ని నిజ జీవిత కథ ఆధారంగా తీస్తున్నారా? అని ప్రశ్నిస్తే.. దానికి సమాధానం కానే కాదు.




-మహేంద్రగిరి వారాహి- చిత్రం నిజ జీవిత కథ ఆధారంగా తీసినది కాదు. ఇది వారాహి మాత దైవశక్తి.. 150 ఏళ్లుగా ఒక రాజవంశంలో జరుగుతున్న వరుస అనుమానాస్పద మరణాల చుట్టూ అల్లుకున్న ఒక కల్పిత ఆధ్యాత్మిక సస్పెన్స్ మిస్టరీ థ్రిల్లర్ కథాంశం. సినిమా కథ ప్రకారం.. పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరి పర్వతాలపై కొలువుదీరిన వారాహి అమ్మవారి శాపం వల్ల ఒక రాజకుటుంబంలో మరణాలు సంభవిస్తున్నాయని స్థానికులు నమ్ముతారు. ఆ శాపం వెనుక ఉన్న అసలు నిజాన్ని ఛేదించేందుకు కథానాయకుడు (సుమంత్) చేసే పోరాటమే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. దర్శకుడు సంతోష్ జాగర్లమూడి పౌరాణిక నమ్మకాలు, భక్తి అంశాలను థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో మేళవించి ఈ ఫిక్షనల్ కథను తెరకెక్కించారు.ట్రైలర్ వేడుకలో దర్శకుడు సంతోష్, నిర్మాతలు మధు - లక్ష్మణ్ మాట్లాడుతూ.. సినిమా షూటింగ్ సమయంలో వారాహి అమ్మవారి అద్భుతమైన దివ్య శక్తిని తాము స్వయంగా అనుభవించామని.. ప్రతిరోజూ ఏదో ఒక మిరాకిల్ జరుగుతుండేదని వెల్లడించారు. సంతోష్ ప్యాషన్‌తో సినిమాను తెరకెక్కించాడని.. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన మ్యూజిక్ థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని చిత్ర యూనిట్ ఆనందం వ్యక్తం చేసింది. భారీ నిర్మాణ విలువలు, ఆధ్యాత్మిక అంశాలు- మిస్టరీతో కూడిన థ్రిల్లింగ్ కథనంతో వస్తున్న -మహేంద్రగిరి వారాహి- సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ట్రైలర్‌కు లభిస్తున్న విశేష స్పందనతో ఈ ఆధ్యాత్మిక థ్రిల్లర్ బాక్సాఫీస్ వద్ద విజయాన్ని సాధిస్తుందనే నమ్మకంతో చిత్ర బృందం ఉంది.

# లేటెస్ట్ బజ్.. యశ్ 'టాక్సిక్'కి ఓటిటి పార్ట్నర్ దొరికేసారా?




కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా కియారా అద్వానీ, నయనతార, తారా సుతారియా అలాగే రుక్మిణి వసంత్ లు ఫీమేల్ లీడ్స్ తో దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కించిన భారీ యాక్షన్ చిత్రమే 'టాక్సిక్'. ఎన్నో అంచనాలు నడుమ విడుదల అయ్యిన ఈ చిత్రం రికార్డు ఓపెనింగ్స్ సాధించింది.అయితే టాక్ బాగా లేకపోయే సరికి రెండో రోజు నుంచే భారీగా డ్రాప్ అయ్యింది. అలాగే ఈ సినిమాకి ఇంకా ఓటిటి, శాటిలైట్ డీల్స్ కూడా జరగకుండానే థియేటర్స్ లోకి కూడా వచ్చిందని తెలిసిందే. మేకర్స్ చెబుతున్న భారీ ధరలకు ఏ ఓటిటి సంస్థ ముందు రాలేదు అన్నట్టు రూమర్స్ వినిపించాయి.ఇలా చాలా కాలం వెయిటింగ్ తర్వాత ఎట్టకేలకి డీల్ లేకుండానే సినిమా థియేటర్స్ లోకి వచ్చింది. కానీ ఇప్పుడు బాలీవుడ్ కథనాలు ప్రకారం టాక్సిక్ కి ఓటిటి పార్ట్నర్ లాక్ అయినట్టు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని జీ 5 వారు సొంతం చేసుకున్నారట. మొత్తం అన్ని భాషల్లో కూడా వీరే కొనుగోలు చేసినట్టుగా టాక్. సో దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది.

# విజయ్ కు సోలో డేట్ ఖాయమా..?




2026 దసరా బరిలో పోటీ ఆలోచనలు వేగంగా మారిపోతున్నాయి. మొదట్లో 'జైలర్ 2', 'విశ్వంభర', 'ఆదర్శ కుటుంబం' వంటి భారీ చిత్రాలతో బాక్సాఫీస్ యుద్ధం గ్యారెంటీ అనుకున్నారు. కానీ సీజీ పనుల ఆలస్యం వల్ల చిరంజీవి 'విశ్వంభర' రేసు నుంచి తప్పుకోగా, రజినీకాంత్ 'జైలర్ 2' రిలీజ్ డేట్ పై కూడా సందిగ్ధత నెలకొంది.ఈ పరిణామాల మధ్య విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న 19వ శతాబ్దపు పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి' అక్టోబర్ 16న వస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. పెళ్లి తర్వాత విజయ్--రష్మిక జంటగా నటిస్తుండటంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ హైప్ ఉంది.పెద్ద చిత్రాలు తప్పుకుంటే విజయ్ కెరీర్‌కు అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్ట్‌కు సోలో లేదా అనుకూలమైన పెద్ద స్పేస్ దొరికే అవకాశం ఉంది. పండగ సెలవలను పూర్తిగా క్యాష్ చేసుకుంటూ, వరుస ఫ్లాప్‌లకు 'రణబాలి' గట్టి బ్రేక్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి

# 'విశ్వనాథ్ అండ్ సన్స్' లాంటి సినిమా చేయాలని ఉంది: సుమంత్

అక్కినేని మనుమడు, నటుడు సుమంత్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం -మహేంద్రగిరి వారాహి-.అక్కినేని మనుమడు, నటుడు సుమంత్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం -మహేంద్రగిరి వారాహి-. సంతోష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ పౌరాణిక సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుక ఇటీవల ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో పాల్గొన్న సుమంత్ సినిమా విశేషాలతో పాటు.. తన మనసులోని మాటలను పంచుకుంటూ వెంకీ అట్లూరి -విశ్వనాథ్ అండ్ సన్స్- వంటి అద్భుతమైన సినిమా చేయాలని ఉందనే తన కోరికను బయటపెట్టారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ.. -మహేంద్రగిరి వారాహి- టీజర్‌కు ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందన లభించిందని.. అది చాలా సహజంగా వైరల్ అయిందని చెప్పారు. టీజర్ సాధించిన ఆదరణ కంటే ఈ ట్రైలర్ పది రెట్లు ఎక్కువగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దర్శకుడు సంతోష్‌తో -సుబ్రహ్మణ్యపురం- తర్వాత ఇది తనకు రెండో సినిమా అని.. దాదాపు మూడేళ్లుగా ఈ కథపై పని చేస్తున్నామని వెల్లడించారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు మధు గారు, లక్ష్మణ్ గారు నిర్మాతలుగా ముందుకు వచ్చి స్తంభాల్లా అండగా నిలబడ్డారని ప్రశంసించారు. వేడుకకు విచ్చేసిన దర్శకుడు వెంకీ అట్లూరి గురించి సుమంత్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. తాను ఇటీవల వెంకి దర్శకత్వం వహించిన చిత్రంలో ఒక సపోర్టింగ్ రోల్ చేశానని గుర్తుచేసుకున్నారు. వెంకి తెరకెక్కించిన సినిమాలన్నింటిలో -విశ్వనాథ్ అండ్ సన్స్- చిత్రం తనకెంతో ఇష్టమైనదని... గత పదేళ్లలో తాను చూసిన టాప్-10 చిత్రాల్లో ఇది ఒకటిగా నిలుస్తుందని కొనియాడారు. ముఖ్యంగా ఆ సినిమా ఫస్ట్ హాఫ్ స్క్రీన్ ప్లే - రైటింగ్ ఒక టెక్స్ట్‌బుక్‌లా ఉంటుందని.. ఇప్పటికే రెండు సార్లు చూసినా మళ్లీ చూడాలనిపిస్తోందని చెబుతూ.. తనకు కూడా అలాంటి మంచి కథాంశంతో కూడిన సినిమా చేయాలని ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక -మహేంద్రగిరి వారాహి- చిత్రంలోని సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ గురించి మాట్లాడుతూ.. స్టార్ హీరో, -డీజే టిల్లు- ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ ఈ సినిమాలో ఒక అత్యంత కీలకమైన పాత్రలో కనిపించబోతున్నారని సుమంత్ రివీల్ చేశారు. ఈ విషయాన్ని ట్రైలర్ ద్వారానే మొదటిసారిగా ప్రేక్షకులకు తెలియజేశామని.. సినిమాలో భాగమైనందుకు సిద్ధుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సిద్ధు పాత్ర సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కానీ ఈ సినిమా విషయంలో మాత్రం తనకు ఒక బలమైన నమ్మకం ఉందని సుమంత్ చెప్పారు. సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ -మహేంద్రగిరి వారాహి- చిత్రం థియేటర్లలో ప్రేక్షకులకు ఒక సరికొత్త, చిరస్మరణీయమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో వెంకీ అట్లూరి సహా చిత్రబృందం పాల్గొన్నారు



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197